క్లుప్తంగా

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో సికిల్‌సెల్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది విద్యార్థినుల రక్తనమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా ప్రాణాంతకమైన వ్యాధి అని, మందులతో పూర్తిగా నయం కాదన్నారు. వ్యాధి సోకిన వారికి వ్యాధి తీవ్రతను బట్టి నిర్ణీత సమయంలో రక్తం ఎక్కించాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ప్రధానోపాధ్యాయుడు అశోక్, ఉత్తమ్, వార్డెన్ స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

జలపాతం వద్ద రక్షణ చర్యలు



లైఫ్ జాకెట్లు అందజేస్తున్న అధికారులు

బోథ్: మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద అటవీ అధికారుల రక్షణ చర్యలు చేపట్టారు. జలపాతం వద్ద ఉండే సిబ్బందికి లైఫ్ జాకెట్లను సోమవారం అందజేశారు. జలపాతం ఇన్‌చార్జి, సొనాల డిప్యూటీ రేంజ్ అధికారి అమర్ సింగ్ మాట్లాడుతూ.. జలపాతం వద్ద గజ ఈతగాళ్లను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు నాగోరావ్, ముంతాజ్, ధన్‌రాజ్, విఠల్, చించోలి వీఎస్ఎస్ చైర్మన్ కె. విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ తరలింపు

ఇచ్చోడ: మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే కూరగాయల మార్కెట్‌ను అంగడిబజార్ నుంచి ఐబీ ఖాళీ స్థలంలోకి తరలించారు. మండల కేంద్రంలో రోడ్డు పనుల్లో భాగంగా శివాజీచౌక్ వద్ద బ్రిడ్జి నిర్మాణం పనులు నడుస్తున్నందున ప్రధాన రోడ్డు గుండా రాకపోకలు నిలిపివేశారు. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలు అంగడిబజార్, సోనార్‌గల్లి నుంచి బస్టాండ్, ఆదిలాబాద్‌కు వెళ్తున్నాయి. దీంతో అంగడిబజార్‌లో నిర్వహించే కూరగాయల మార్కెట్‌ను ఐబీ ఖాళీ స్థలంలోకి మార్చినట్లు పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. బ్రిడ్జి పనులు పూర్తయేంత వరకు ఐబీ ఖాళీ స్థలంలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు.

డీసెట్ సీట్లకు వెబ్ ఆప్షన్లు

ఆదిలాబాద్‌టౌన్: డీసెట్ 2024కు సంబంధించి మొదటి, రెండో దశలో ర్యాంకులు పొంది అడ్మిషన్లు తీసుకోని అభ్యర్థులు 2025 జనవరి 2 నుంచి 4వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు 9న సీట్ల కేటాయింపు, 9వ తేదీ నుంచి 13 వరకు కేటాయింపు పత్రాలు డౌన్‌లోడ్ చేసుకోవాలని, 16న కళాశాలలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

'ఆడపిల్లలను చదివించాలి'



మాట్లాడుతున్న సంస్థ అధ్యక్షుడు రాము

ఆదిలాబాద్‌రూరల్: ఆడపిల్లలను తప్పనిసరిగా చదివించాలని న్యూ రెయిన్‌బో వెల్ఫేర్ సొసైటీ (ఎన్జీవో) సంస్థ అధ్యక్షుడు కొమ్ము రాము అన్నారు. సోమవారం మండలంలోని చించుఘాట్ గ్రామంలో సంస్థ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, బేటీ బచావో బేటీ పఢావో, విద్యా హక్కు చట్టం, పరిసరాల పరిశుభ్రత అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ జంగు బాపు, నాయకులు పరశురాం, శంభు, గణపతి, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

'ప్రతీ ఒక్కరు హనుమాన్ చాలీసా పఠనం చేయాలి'



పుస్తకాలు పంపిణీ చేస్తున్న శంకరయ్య

ఇచ్చోడ: ప్రతీ ఒక్కరు ప్రతీరోజు హనుమాన్ చాలీసా పఠనం చేయాలని గురుదాస్ శంకరయ్య తెలిపారు. సోమవారం మండలంలోని దాబాబిలో హనుమాన్ చాలీసా పుస్తకాలు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 80 గ్రామాల్లో హనుమాన్ చాలీసా పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

జూడో క్రీడాకారుల సత్తా

- 35 పతకాలతో ప్రతిభ
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



సబ్ జూనియర్, యూత్ జూడో ఓవరాల్ చాంపియన్‌షిప్ అందుకుంటున్న క్రీడాకారులు, కోచ్ రాజు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాల పంట పండించారు. ఏకంగా 36 పతకాలను కొల్లగొట్టి ఔరా అనిపించారు. హైదరాబాద్‌లో ఈనెల 25, 26 తేదీల్లో జరిగిన సీనియర్ స్టేట్ లెవెల్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో 8 పతకాలతో మెరిశారు. కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఈనెల 27, 28వ తేదీల్లో జరిగిన సీఎంకప్ రాష్ట్రస్థాయి పోటీల్లో 10 పతకాలు కైవసం చేసుకున్నారు. క్రీడా పాఠశాలలోనే ఈనెల 29, 30 తేదీల్లో జరిగిన సబ్ జూనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో 7 పతకాలు సాధించారు. యూత్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో 11 మెడల్స్ గెలిచారు. జిల్లా జట్టు సీనియర్ స్టేట్ విభాగంలో ఓవరాల్‌గా రెండో స్థానంలో నిలవగా, సబ్ జూనియర్ స్టేట్ విభాగంలో మూడవ స్థానంలో నిలిచింది. మరోవైపు యూత్ స్టేట్ విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. సీనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారం పతకం సాధించిన క్రీడాకారులు ఢిల్లీ వేదికగా జరిగే జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని, యూత్, సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్న క్రీడాకారులు పూణే వేదికగా జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని జూడో కోచ్ రాజు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవడంపై డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, క్రీడా సంఘాల బాధ్యులు స్వామి, స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపల్ భూమన్న, డీఎస్‌ఏ సిబ్బంది అభినందించారు.

విజేతలు వీరే..

రాష్ట్రస్థాయి సీనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో రమ్య, చాందిని, అలేఖ్య, శ్రీజ, డాంగ్లిలు బంగారు పతకాలు సాధించారు. వసుధ, సాయి వర్షన్ రెడ్డి, మధులు కాంస్య పతకాలతో నిలిచారు. సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో సునీత, సహస్ర, రమ్య, చాందిని, అలేఖ్య, వసుధ, సతీశ్, తరుణ్ స్వర్ణ పతకాలతో మెరవగా, హర్షవర్ధన్, మధులు కాంస్య పతకాలు గెలిచారు. సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో అక్షిత, ఝాన్సీలు పసిడి పతకాలతో మెరవగా, ఉషస్విని, సిద్దు, సమ్యక్‌లు రజత పతకాలు కొల్లగొట్టారు. మనోజ్ కుమార్, ఈశ్వర్‌లు కాంస్య పతకాలతో తృతీయ స్థానంలో నిలిచారు. రాష్ట్రస్థాయి యూత్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో సునీత, సహస్ర, రమ్య, చాందిని, అలేఖ్య, సతీశ్, తరుణ్, హర్షవర్ధన్, అఖిల్‌లు స్వర్ణ పతకాలు సాధించగా, శ్రీజ రజత పతకంతో మెరిసింది. వసుధ కాంస్య పతకం సాధించింది.

కళ్లకు గంతలతో నిరసన



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. సమ్మె 21వ రోజుకు చేరుకున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. కవిత, అర్చన, దీప్తి, సువర్ణ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

'రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'



అవగాహన కల్పిస్తున్న శ్యామ్

నేరడిగొండ: పత్తి పంటకు గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం ఉందని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ విస్తరణ అధికారి శ్యామ్ అన్నారు. సోమవారం మండలంలోని తేజాపూర్ గ్రామంలోని పంట పొలాలను సందర్శించారు. పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పత్తి పంట తీయడం పూర్తయిన తర్వాత పంట పొలాలను కలియదున్నాలని సూచించారు. దీని ద్వారా పొలంలో సేంద్రియ పదార్థం తయారై అధిక దిగుబడులు పొందడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వేసవి దుక్కులు చేయడం ద్వారా పురుగు కోశాస్త దశలను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. ఆయన వెంట రైతులు రాజారెడ్డి, గంగయ్య, నరసింహారెడ్డి, ప్రదీప్ తదితరులు ఉన్నారు.

5న నాగోబా విద్యార్థి నిలయం వార్షికోత్సవం



సమావేశంలో చర్చిస్తున్న కమిటీ సభ్యులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వనవాసీ కల్యాణ పరిషత్, నాగోబా విద్యార్థి నిలయం వార్షికోత్సవాన్ని జనవరి 5న నిర్వహించనున్నట్లు ఆవాస ప్రాంత అధ్యక్షుడు మారుతి డొంగ్రె, ఆవాస ప్రాంత కార్యదర్శి దేశ్ పాండే వెంకటేశ్వరరావులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని నాగోబా విద్యార్థి నిలయంలో వార్షికోత్సవం నిర్వహనపై కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వార్షికోత్సవానికి ఎంపీ గోడం నగేశ్‌తో పాటు ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు పటేల్, వనవాసీ కళ్యాణ పరిషత్ రాష్ట్ర కమిటీ ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. సభ్యులు చింతవార్ ప్రకాశ్, శంకర్‌లాల్, ఉమాశంకర్, విశ్వనాథ్, అనిల్, కనక తుకారం, రాముజీ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

ఎదులాపురం: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను భర్తరఫ్ చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో ఆందోళన నిర్వహించారు.

రాజకీయ పలుకుబడితో వర్గీకరణకు అడ్డు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): మాలలు తమకున్న రాజకీయ పలుకుబడితో ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బుర్రి సతీశ్ మాదిగ అన్నారు. సోమవారం జైనథ్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల సదస్సు నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఓటరు జాబితా ప్రదర్శన

బోథ్: నియోజకవర్గ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర సెకండరీ పాఠశాల వద్ద మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఎమ్మెల్సీ నియోజకవర్గ గ్రాడ్యుయేట్స్, టీచర్లకు సంబంధించిన ఓటరు జాబితాను సోమవారం ప్రదర్శించారు. పోలింగ్ బూత్ 78, 79లో గ్రాడ్యుయేట్, పోలింగ్ బూత్ 47లో టీచర్ ఓటర్ల జాబితాను ప్రదర్శించారు.

2న మెగా రక్తదాన శిబిరం

ఇంద్రవెల్లి: మండలంలోని పిట్టబొంగరం గ్రామంలో ఇంద్రవెల్లి అమరవీరుల స్ఫూర్తితో నవజ్యోతి యూత్, గ్రామస్తుల ఆధ్వర్యంలో జనవరి 2న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామ పటేల్ వెట్టి రాజేశ్వర్ అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని పిట్టబొంగరంలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. రక్తదాన శిబిరం ఏర్పాటుపై చర్చించారు.

'దాడిని ఖండిస్తున్నాం'

బజార్‌హత్నూర్: రంగారెడ్డి జిల్లా తక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న దళిత ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడిని ఖండిస్తున్నామని బహుజన టీచర్స్ ఫెడరేషన్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కాంబ్లే విజయ్ కుమార్ తెలిపారు. సోమవారం బహుజన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

పేదలకు అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్ రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో పేదలకు అన్నదానం చేశారు.

'కొత్త సంవత్సరం వేడుకలు జరపొద్దు'

ఆదిలాబాద్‌టౌన్: నూతన సంవత్సర వేడుకలు జరపొద్దని టీజీవీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొట్టూరి ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ హిందూ సాంప్రదాయం ప్రకారం ఉగాది పండగ కొత్త సంవత్సరమన్నారు.

పాఠశాలలోని మూత్రశాల ధ్వంసం



అల్లరిమూకలు ధ్వంసం చేసిన మూత్రశాల

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని మూత్రశాలను అల్లరి మూకలు ధ్వంసం చేశారు. ఇటీవల క్రిస్మస్ సెలవుల్లో పాఠశాలలో కొంతమంది మద్యం సేవించి నానా హంగామా సృష్టించారు. మద్యం సేవించి మద్యం బాటిళ్లను పగులగొట్టారు. మూత్రశాలలో ఉన్న సామగ్రిని ధ్వంసం చేశారు. ఇటీవలే మూత్రశాలకు మరమ్మతులు చేశారు. కాగా అల్లరి మూకలు ధ్వంసం చేయడంతో మూత్రశాల నిరుపయోగంగా మారింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

శాంతియుతంగా వేడుకలు నిర్వహించాలి

ఇంద్రవెల్లి: నూతన సంవత్సర వేడుకలను శాంతియుత వాతావరణంలో నిర్వహించి పోలీసులకు సహకరించాలని ఎస్సై దుబ్బక సునీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డిసెంబర్ 31న రాత్రి 7 గంటల నుంచి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

బోథ్: నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ వెంకటేశ్వర రావు, ఎస్సై ప్రవీణ్ కుమార్‌లు తెలిపారు. సోమవారం మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. రాష్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, బైక్ రేసింగ్ వంటి వాటికి పాల్పడొద్దని తెలిపారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చించుఘాట్ గ్రామానికి చెందిన 20 ఏళ్ల కుమ్ర అర్చన అనే యువతి అదృశ్యమైనట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చించుఘాట్ గ్రామానికి చెందిన యువతి అర్చన ఈనెల 24న అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో గాలించినా లభించలేదు. దీంతో యువతి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఎంను కలిసిన కంది శ్రీనివాస్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డితో కంది శ్రీనివాస్‌రెడ్డి

కైలాస్‌నగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో సీఎం, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలతో ఆదిలాబాద్‌కు సంబంధించి కీలక అంశాలపై చర్చించారు.

'సమస్యల పరిష్కారంలో మంత్రులు విఫలం'



సీఆర్టీలకు మద్దతు తెలుపుతున్న జోగు రామన్న

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ మంత్రులు మాట ఇచ్చి తప్పుతున్నారని మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. మోసపూరిత హామీలతో ఉద్యోగులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట సీఆర్టీలు చేపడుతున్న సమ్మె శిబిరాన్ని సోమవారం ఆయన మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి సందర్శించారు. దీక్షా శిబిరంలో కూర్చొని ఉద్యోగులకు మద్దతు తెలిపారు. సీఆర్టీలు తమ సమస్యలను జోగు రామన్నకు వివరించారు. బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు నారాయణ, జైవంత్‌రావు, ధరణి రాజేశ్, వెంకటేశ్, రాజు, సంతోష్, రాము ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

తలమడుగు: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని పునగూడ ఆశ్రమ పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆశ్రమ పాఠశాలతో పాటు బాలిక వసతి గృహాలలో నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వసతిగృహం పరిసరాలు పరిశీలించారు.

విద్యార్థులకు యోగాపై శిక్షణ



యోగాపై శిక్షణ ఇస్తున్న యోగిత

బోథ్: మండలంలోని కౌఠ బి గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సోమవారం ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా యోగా శిక్షకురాలు మునిగెల యోగిత విద్యార్థులకు యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు యోగా ప్రాముఖ్యత వివరించారు. ప్రతీరోజు యోగా చేయడం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె'



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారంపై ఈ నెల 31వ తేదీలోపు జీవో జారీ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. సోమవారం సంస్థ జిల్లా మేనేజర్ సుధారాణీని తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించకుంటే జనవరి 1 నుంచి విధులు నిలిపివేసి సమ్మెకు దిగుతామన్నారు. సలీం, మోసిన్, రమేశ్, రాజేందర్, పొచ్చన్నలు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీ గోడం నగేశ్

తాంసి: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను సోమవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ పరామర్శించారు. తాంసి గ్రామానికి చెందిన కాడిగిరి సంతోష్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఎంపీ పరామర్శించారు. జామిడి, గిరిగాం గ్రామాల్లో సైతం వివిధ కుటుంబాలను ఆయన పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ రాజు, నాయకులు అరుణ్, సదానంద్, నారాయణ తదితరులు ఉన్నారు.

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన మాదూరి మల్లేశ్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ సోమవారం మల్లేశ్ కుటుంబాన్ని పరామర్శించారు. కనపర్తి చంద్రకాంత్, తాంసి మాజీ జెడ్పీటీసీ రాజు, నాయకులు నారాయణ, బోండ్ల వెంకటస్వామి, వామన్, సదానందం, మహేందర్ యాదవ్, నారాయణ రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్, కాశీరాం, అశోక్, శ్రీకాంత్, రామ్ రెడ్డి, నాగన్న పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని గొలిగూడ గ్రామానికి చెందిన దత్త ఇటీవల బైక్ యాక్సిడెంట్‌లో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ఆయనను పరామర్శించారు. సోమవారం ఆస్పత్రికి చేరుకుని ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు సోమవారం ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడాపోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. కబడ్డీ, ఖోఖో క్రీడా విభాగంలో బాలురు, బాలికల జట్లు ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. 100 మీటర్ల పరుగు పందెం క్రీడా విభాగంలో దొంతుల యశ్వంత్, క్యాతం అక్షిత, 200 మీటర్ల పరుగు పందెం, హైజంప్ విభాగాల్లో కొంగర్ల చైతన్య, 400 మీటర్ల పరుగు పందెంలో పద్వల్ హారతి ప్రథమ స్థానం సాధించి ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వొర్ని వెంకటరమణ, ఉపాధ్యాయులు స్వప్న, దుబ్బుల రమణ, శిరీష, సంజీవ్ అభినందించారు.

అసెంబ్లీలో రెవెన్యూ డివిజన్ అంశాన్ని లేవనెత్తాలి



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

బోథ్: బోథ్ రెవెన్యూ డివిజన్ అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తాలని సీపీఐ ఫ్లోర్ లీడర్ కూనంనేని సాంబశివరావుకు బోథ్ సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. సీపీఐ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాలో నిర్వహించిన సభలో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. రెవెన్యూ డివిజన్ కేంద్రం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అగ్ని మాపక కేంద్రం, మినీ స్టేడియం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వారు కోరారు. నాయకులు గోవర్ధన్, దాస్, భోజన్న, నరేశ్, మున్సిఫ్ పాల్గొన్నారు.